ప్రజాశక్తి

శుక్రవారం 31 మార్చి 2023   8 పేజీలు





ప్రకాశం   బాపట్ల



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

నిధులు నేనిస్తా..నీళ్లివ్వండి..

- ప్రజలకు తాగునీటి కష్టాలు రాకుండా చూడాలి..
- అవసరమైన చోట సొంత నిధులతో నీళ్లిస్తా..
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సురేష్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని, అత్యవసర పరిస్థితులు ఉన్న చోట తాను సొంత నిధులు ఇస్తానని, నీళ్లు ఇచ్చే బాధ్యత అధికారులు చూడాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మార్కాపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. యర్రగొండపాలెం మండలంలోని అన్ని మండలాల్లో భూగర్భజలాలు అడుగంటుతున్న పరిస్థితిని అధికారులు వివరించారు. బోర్లు వేస్తే నీళ్లు వచ్చే అవకాశాలు ఉన్న చోట తక్షణమే బోర్లు వేయాలన్నారు. పెద్దదోర్నాల మండలంలో బొమ్మలాపురం, చిన్నదోర్నాలలో మూడు బోర్లు వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పుల్లలచెరువు మండలంలో చెన్నంపల్లి, గంగవరం గ్రామాల్లో బోర్లు వేస్తామని, దూరం నుంచి పైప్ లైన్ ద్వారా నీళ్ల తరలించేందుకు తమ నాయకులు ఏర్పాట్లు చేస్తారని మంత్రి చెప్పారు. మండల కేంద్రమైన పుల్లలచెరువులో సాగర్ నీళ్లు పైప్ లైన్ ద్వారా ఇస్తామని అధికారులు చెప్పటంతో గ్రామంలో కొళాయిల ఏర్పాటుకు రూ.5 లక్షలు తక్షణమే మంజూరు చేస్తున్నామని చెప్పారు. త్రిపురాంతకం మండలంలోని దువ్వలి, లేళ్లపల్లి గ్రామాల్లో సమస్య అధికమని, అక్కడ ట్యాంకర్‌లతో సరఫరా చేస్తామన్నారు. యర్రగొండపాలెం ▶ 2లో

గొంతెండుతోంది..!

- పనిచేయని మంచినీటి పథకాలు
- ట్యాంకర్లతో నీళ్లు తోలని పరిస్థితి
- నీటి కష్టాల్లో పశ్చిమ ప్రకాశం ప్రజలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రోజురోజుకూ పశ్చిమ ప్రకాశంలో కన్నీటి కష్టాలు అధికమవుతున్నాయి. డీప్‌బోర్లు మెరాయించడం, మంచినీటి పథకాలకు మరమ్మత్తులు చేయకపోవడం, నీటి ట్యాంకర్ల తోలకం.. అప్పులు అధికమై బిల్లులు చెల్లించకపోవడంతో ట్యాంకర్ల యజమానులు చేతులెత్తేయడం లాంటి చర్యలతో నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. వేసవి కాలం రానే వచ్చేసింది. ఫలితంగా పశ్చిమ ప్రకాశంలోని అత్యధిక గ్రామాల్లో తాగునీటి బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పాతాళానికి చేరాయి. నీటి వనరుల లభ్యత లేక కొన్ని ఆవాస ప్రాంతాల్లోని రక్షిత మంచినీటి పథకాలు నిరుపయోగంగా మారాయి. ఆయా గ్రామాల్లో గత వేసవి నుంచే ట్యాంకర్ల ద్వారా సరఫరా కొనసాగుతోంది. ఇందుకుగాను చెల్లించాల్సిన బిల్లుల బకాయిలు కూడా అపరిష్కృతంగా ఉన్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే ముున్ముందు పరిస్థితి ఏంటని పలువురు ఆందోళన చెందుతున్నారు.



ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న జనం

జిల్లావ్యాప్తంగా 730 గ్రామ పంచాయతీల్లోని 1771 ఆవాస ప్రాంతాల్లో మొత్తం 17,632 తాగునీటి పంపులున్నాయి. వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల్లో ఉన్న వీటికి మరమ్మతులు చేపట్టేందుకు గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు ప్రణాళిక చేశారు. ఇప్పటివరకు 708 ఆవాస ప్రాంతాల్లోని సుమారు 5,775 వేల చేతిపంపులను పరిశీలించగా అందులో 1029 ఎండిపోయాయి. మరో 596 బోర్లకు మరమ్మతులు చేశారు. జిల్లావ్యాప్తంగా రక్షిత మంచినీటి పథకాలు, మినీ రక్షిత మంచినీటి పథకాలు, డైరెక్ట్ పంపింగ్‌వి మొత్తం 2,858 ఉన్నాయి. అందులో ప్రస్తుతం 315 పథకాలు నీటి వనరులు పూర్తిగా ఎండిపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. గ్రామీణ నీటి సరఫరా విభాగం మార్గదర్శకాల ప్రకారం బోరును గరిష్టంగా 200 ఆడుగుల లోతు వరకు వేస్తారు. పశ్చిమ ప్రాంతంలో అంత వరకు వేసినా నీటి జాడ లేకపోతుండడంతో అధికారులు చేతులెత్తేశారు. భూగర్భజలాల లభ్యత లేక ఆయా ప్రాంతాల్లోని బోర్లలో పూడికతీత కార్యక్రమం చేపడుతున్నా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. ఈ పరిస్థితుల దష్ట్యా నీటి వేసవి ఎద్దడి ▶ 7లో



దోర్నాలలో సీతారాముల కల్యాణ వేడుకలలో మంత్రి సురేష్

వైభవంగా సీతారాముల కల్యాణం

▶ 2లో

సముద్రతీర ప్రాంతంలో కోడిపందేలు

- లక్షలు చేతులు మారుతున్న వైనం
- టీడీపీ, వైసీపీ నాయకుల పెత్తనం

▶ 8లో

ప్రభుత్వ వైద్యశాలలో లంచాల బాగోతం

- కాన్పు చేయాలంటే కాసులు ఇవ్వాల్సిందే
- ఒక్కో ఆపరేషన్‌కు ఒక్కో రేటు

▶ 3లో

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- విద్యార్థుల ఇంటికి ఫోన్ చేసి.. నిద్ర లేపి మరీ చదివిస్తున్న ఉపాధ్యాయులు
- 100 శాతం ఫలితాలకు విశేష కృషి
- సావిత్రి గణేష్ జడ్పీ పాఠశాలలో 'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-రేపల్లె

ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ.. వారు పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేలా కృషి చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ.. వారు కూడా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మండలంలోని వడ్డీవారిపాలెంలో సావిత్రి గణేష్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వేకువజామున ఫోన్ చేసి.. వాళ్లు నిద్రలేచి చదివేలా ప్రోత్సహిస్తున్నారంటే.. ఇక్కడి ఉపాధ్యాయులు విద్యార్థుల చదువు పట్ల ఎంత ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.



విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు

పదోతరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ప్రణాళికలను ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. ఎలాగైనా మంచి మార్కులు సాధించి ▶ 2లో

పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



రేపల్లె ఎంఇఒ టి.నవీన్ కుమార్

పదోతరగతి విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. పాఠశాలల్లో మంచి ఫలితాలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది. విద్యార్థుల సామర్థ్యాలను బట్టి ఉపాధ్యాయులు వారిని వివిధ కేటగిరీలుగా విభజించారు. బాగా చదివేవారిని ఏ-కేటగిరిగా, పర్వాలేదనిపించే వారిని బి-కేటగిరిగా, చదువులో వెనుకబడిన విద్యార్థులను సి-కేటగిరిలో చేర్చి.. వారికి అనుగుణంగా పాఠాలను బోధిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ఏ-కేటగిరీలో ఉన్న విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు.

తెల్లవారుజామునే విద్యార్థులకు ఫోన్లు..



ఎం.జోత్స్న, ప్రధానోపాధ్యాయులు, సావిత్రి గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా చదివిస్తూ వారి సందేహాలను నివృత్తి చేస్తున్నాం. పాఠశాలలో 86 మంది విద్యార్థులు ఉన్నారు. ఏయే సబ్జెక్టుల్లో వెనకబడి ఉన్నారో వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. అదనపు ప్రిపేరేషన్ తరగతులను నిర్వహిస్తున్నాం. తెల్లవారుజామునే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి.. విద్యార్థులు నిద్ర లేచి.. చదువుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కెరీర్ గైడెన్స్‌పై కూడా వారికి అవగాహన కల్పిస్తున్నాం.

మోటివేషన్ తరగతులు నిర్వహించాం..



చాట్రగడ్డ రాజభూషణం, యుటిఎఫ్ మండల అధ్యక్షులు

విద్యార్థులకు సరళమైన రీతిలో విద్యాభ్యాసం కోసం యుటిఎఫ్ కషి చేస్తోంది. నిష్ణాతులైన సీనియర్ ఉపాధ్యాయులతో ఆరు పేపర్ల ప్యాట్రన్, ఎగ్జామ్ ఓరియెంటెడ్లో మోడల్ పేపర్స్ విత్ ఆన్సర్స్ రూపొందించాం. అన్ని స్థాయిల విద్యార్థులకు ఉపయోగపడే మోడల్ టెస్ట్ పేపర్లను మండల వ్యాప్తంగా వెయ్యి కాపీలను వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేశాం. పదో తరగతి పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత, మానసికంగా పరీక్షల సన్నద్ధతకు పలు మోటివేషన్ తరగతులు నిర్వహించాం.

నిధులు నేనిస్తా..నీళ్లివ్వండి..

(మొదటిపేజీ తరువాయి)

మండలం తమ్మడపల్లి, గుర్రపుశాల పంచాయతీలతో పాటు నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో ట్యాంకర్‌లతో నీళ్ల తోలెందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో నీళ్ల ట్యాంకర్ల బిల్లులు రాలేదని అందరూ అడుగుతున్నారని అధికారులు చెప్పారు. ఈ విషయం సీఎం దష్టిలో ఉందని, ఏప్రిల్ నెలలో బిల్లులు మంజూరు చేస్తానని సీఎం హామీ ఇచ్చారని మంత్రి సురేష్ వివరించారు. సమీక్షలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రామకష్ణ, అన్ని మండలాల ఏఈలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

(మొదటిపేజీ తరువాయి)

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకునే పనిలో విద్యార్థులు నిమగమయ్యారు. రేపల్లె మండలంలో ఐదు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, రెండు గురుకుల పాఠశాలలు, ఒక ప్రభుత్వ పాఠశాల ఉన్నాయి. ఉదయం పూట టెస్టులు, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులతో ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. చదువుల్లో వెనుకబడిన వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు ఇతర పనులు చెప్పొద్దని, చదువుకునేందుకు ఎక్కువ సమయం కేటాయించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. ప్రత్యేక తరగతుల సమయంలో అందిస్తున్న స్నాక్స్ విద్యార్థులకు నచ్చేలా.. వారు మెచ్చేలా ఒక్కో రోజు ఒక్కో రకమైన తినుబండారాలను అందిస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు ఇతర పనులు చెప్పొద్దని, చదువుకునేందుకు ఎక్కువ సమయం కేటాయించాలని తల్లిదండ్రులకు సూచించామ న్నారు. ప్రత్యేక తరగతుల సమయంలో అందిస్తున్న స్నాక్స్ విద్యార్థులకు నచ్చేలా.. వారు మెచ్చేలా ఒక్కో రోజు ఒక్కో రకమైన తినుబండారాలను అందిస్తున్నామని తెలిపారు.

మంచి ఫలితాలు సాధిస్తాం..

ప్రణీత్ సాయిరాం, విద్యార్థి



అన్ని సబ్జెక్టుల్లోనూ నూరు శాతం ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు మాపై శ్రద్ధ చూపిస్తున్నారు. పరీక్షలంటే భయం లేకుండా ఉండేందుకు ప్రణాళికా బద్ధంగా చదివి స్తున్నారు. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలతో పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించగలననే నమ్మకం ఏర్పడింది. ఉపాధ్యాయులు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మంచి మార్కులు సాధించేందుకు కృషి చేస్తా.

అర్థమయ్యేలా బోధిస్తున్నారు..

గాదె అస్మిత, విద్యార్థిని



విద్యార్థులు అందరూ మంచి మార్కులు సాధించాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహి స్తున్నారు. స్టడీ మెటీరియల్, ఇతర మోడల్ పేపర్స్ అందించి అర్థమయ్యేలా బోధిస్తున్నారు. ఇంటి దగ్గర కూడా సమయాన్ని కేటాయించి చదువుకునేలా ఉపాధ్యాయులు ఫోన్ ద్వారా పలు సూచనలు చేస్తున్నారు.

ఒత్తిడి లేకుండా చదువు..

కె.ఋషిష్యనందు, విద్యార్థి




ఉపాధ్యాయులు మాపై ఒత్తిడి లేకుండా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రత్యేక టెస్టులు నిర్వహించి.. విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి మరింత మెరుగైన ఫలితాలు సాధించటానికి కషి చేస్తున్నారు. పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తా.

వైభవంగా సీతారాముల కల్యాణం

పలు చోట్ల అన్నదానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

శ్రీరామనవమి సందర్భంగా పెద్ద దోర్నాలలోని రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా, కన్నుల పండువలా నిర్వహించారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. తొలుత స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల కల్యాణమహోత్సవాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శ్రీ రామనామ స్మరణతో మార్మోగింది. శ్రీ సీతారాముల కళ్యాణం సందర్భంగా ఆలయ పురోహితులు రామ ప్రసాద్ శర్మ శ్రీరామనవమి, సీతారామ కళ్యాణ మహోత్సవ విశిష్టత గురించి భక్తులకు తెలియజేశారు. సీతారామ కళ్యాణ మహోత్సవం సందర్భంగా మంత్రి సురేష్ స్వామి వారికి పట్ట వస్త్రాలు అందజేశారు.ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకా ంక్షించారు. సీతారాముల కళ్యాణానికి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జార్జి విద్యాసంస్థల డైరెక్టర్, వైసిపి యువనేత ఆదిమూలపు విశాల్, వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, నాయకులు అమిరెడ్డి రామిరెడ్డి,గంటా గురవారెడ్డి,కిశోర్ కుమార్, చంద్రకాంత్ నాయక్,జోగి వెంకట నారాయణ, అల్లు ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు. **ఒంగోలు సబర్బన్** : శ్రీరామనవమి సందర్భంగా లాయర్‌పేటలోని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసంలో గురువారం సీతారామ కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలినేని శ్రీనివాసరెడ్డి ఆయన సతీమణి శచిదేవి, ఆయన కుమారుడు, కోడలు, బంధువులు కళ్యాణంలో పాల్గొన్నారు. సీతారాముల కళ్యాణాన్ని చూసేందుకు నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, ప్రజలు తరలివచ్చారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదానం నిర్వహించారు. **దర్శి** : శ్రీరామనవమి సందర్భంగా స్థానిక గాంధీనగర్ సమీపంలోని రామాలయంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్ర మాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం అద్దంకి రోడ్‌లోని 1వ వార్డులో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు.గాంధీనగర్ రామాలయంలో మద్దిశెట్టి శ్రీధర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, కీసరి రాంభూపాల్‌రెడ్డి, కీసరి శ్రీనివాసరెడ్డి, కుందురు నరసింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాములు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. చదలవాడలోని శ్రీరఘునాయక దేవస్థానంలో ఇఒ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు ఉప్పుగుండూరులో ఆర్యవైశ్య రజక శాలివాహన దేవస్థానంలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. కమ్మవారి కళ్యాణమండపంలో 12మంది దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కళ్యాణం నిర్వహించారు. **మద్దిపాడు :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. మద్దిపాడు రామాలయంలో ప్రధాన అర్చకుడు వావిలాల రమేష్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు మండల పరిధిలోని నేలటూరు, మల్లవరం గ్రామాల్లోనూ సీతారాముల కల్యాణమహోత్సవాన్ని నిర్వహిం చారు. **చీమకుర్తి :** ప్రజలు శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్ లోని కోదండరామస్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాములు కల్యాణ మహోత్సవంలో మద్దిపాడు ఎఎంసి మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ్‌నగర్‌లోని సీతారామస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ వద్ద నున్న ఆలయంలో టిటిడి దేవస్థానం అర్చకులు పరాంకుశం సాయికృష్ణమాచార్య, భట్టర్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణమహోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పల్లపోతు శంకర్ పాల్గొన్నారు.కోటకట్లవారిబజారులోని ఆలయం వద్దఅన్నదానం నిర్వహించారు. **యర్రగొండపాలెం :** మండల పరిధిలోని పలు దేవాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ కళ్యాణ వేడుకలు నిర్వహించారు. పండరీ నాధ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ తోట మహేష్ నాయుడు తమ కుటుంబ సభ్యులతో కలిసి భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తమసు సుబ్రహ్మణ్యం, పెరుమాళ్ల మల్లికార్జున, గొళ్ళ సుబ్బారావు, యక్కలి ప్రసాద్, పొట్టి మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు. **దొనకొండ :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్థానిక శివాజీనగర్, రైల్వే క్వార్టరస్ ప్రాంతాల్లోని దేవాలయాల్లో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కళ్యాణం జరిపించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



పెద్దదోర్నాలలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి సురేష్



దర్శిలో అన్నదానం చేస్తున్న జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



ఒంగోలులో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి , శచీదేవి దంపతులు



ఒంగోలులో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా దంపతులు



దొనకొండలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న దంపతులు

పండగ పూట.. ఆ కుటుంబాలలో విషాదం

మండలంలో వేరువేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతి ● ట్రాక్టర్ ఢీకొని ఒకరు.. రోడ్డు ప్రమాదంలో మరొకరు ● కన్నీరు మున్నీరవుతున్న బంధువులు

ప్రజాశక్తి-చీరాల

శ్రీరామ నవమి పండగ పూట కుటుంబ సభ్యులతో సరదాగా పండుగ జరుపుకోవాల్సిన ఆ కుటుంబాలలో విషాదం చోటుచేసుకుంది. పుట్టింటిలో ఉన్న తన భార్యను కలసి తన ఇంటికి కొన్ని క్షణాలలో చేరుకునే లోపే రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా.. అప్పటివరకు స్నేహితులతో ఆనందంగా గడిపిన ఓ యువకుడు తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనం నడుపుతూ ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఆ రెండు కుటుంబాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే..

చీరాల మండలం హరి ప్రసాదనగర్‌కు చెందిన వడ్లమూడి సుబ్బారావు(48) పట్టణంలోని సరస్వతి హాస్పిటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే బుధవారం అర్ధరాత్రి మండల పరిధిలోని గవినివారిపాలెంలో ఉన్న తన భార్య పుట్టింటికి ఒక్కడే ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి పిట్టువారిపాలెం మీదుగా ఇంటికి వస్తుండగా పిట్టువారిపాలెం గవినివారిపాలెం రోడ్డు మధ్య జరిగిన ప్రమాదంలో ద్విచక్ర వాహనంతో పాటు రోడ్డుపక్కన గల కాలువలోకి పడిపోయి మృతిచెంది ఉన్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఈపూరుపాలెం ఎస్ఐ జనార్ధన్ సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు సంతానం ఉన్నారు. పండగ పూట సుబ్బారావు మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.





వడ్లమూడి సుబ్బారావు, గరికిన సాగర్ (ఫైల్ ఫొటోలు)

- వాడరేవు రోడ్డులో..

అప్పటి వరకు కుటుంబ సభ్యులతో ఉండి స్నేహితుని కోసం అని ద్విచక్ర వాహనంతో బయటకు వచ్చిన తన కుమారుడు ఇక లేడు అని తెలిసి ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. గురువారం వాడరేవుకు చెందిన గరికిన సాగర్(18) అతని మిత్రుడు యాకోబుతో కలిసి ద్విచక్ర వాహనంపై చీరాలకు బయలుదేరాడు. అయితే మార్గమధ్యంలోని వాకావారిపాలెం సమీపానికి రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని ట్రాక్టర్ ఒక్కసారిగా బైక్‌ను ఢీకొనడంతో సాగర్ అక్కడిక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చొని ఉన్న మిత్రుడు యాకోబు కాలుకు తీవ్ర రక్త గాయమైంది. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు సహచరుడు యాకోబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఉదయాన్నే పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వ వైద్యశాలలో లంచాల బాగోతం

- కాన్పు చేయాలంటే కాసులు ఇవ్వాల్సిందే


- ఒక్కో ఆపరేషన్‌కు ఒక్కోరేటు

- ఠాగూర్ సినిమా చూపిస్తున్నారంటూ రోగుల ఆగ్రహం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నవమాసాలు మోసి పండంటి బిడ్డడి ప్రసవానికి ప్రభుత్వ వైద్యశాలకు వెళితే కాన్పుకోసం కాసులు ఇవ్వక తప్పని దుస్థితి యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం అందరికీ వైద్యం అందాలి, అందరు బాగుండాలి ,ఏ ఒక్కరు కూడా వైద్యం అందక చనిపోకూడదని చెబుతున్నా.. యుర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతోంది. బుధవారం రాత్రి ఓ మహిళకు గర్భసంచి సమస్య వచ్చి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళితే ప్రవేటు ఆసుపత్రిలో రూ.40 వేలు ఖర్చవుతుంది. మేమయితే రూ.20 వేలకు చేస్తాం. ఆలోచించుకోండి. అంటూ బేరాసారాలకు దిగడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది.

యర్రగొండపాలెం పట్టణంలో పాత ఇనుప సామాన్లు కొనే వ్యాపారం చేసే వాడిని. నిరుపేదను అని చెప్పి బ్రతిమాలాడినా ససేమిరా అనడంతో వారు యర్రగొండపాలెంలోని ముస్లిం యూత్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో ఇస్మాయిల్ ప్రభుత్వ వైద్యులను సంప్రదించి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో డబ్బులు ఎందుకు ఇవ్వాలంటూ నిలదీయడంతో వాగ్వాదం జరిగింది. గతంలో అనేక పర్యాయాలు ప్రభుత్వ వైద్యశాలలో కాన్పుకోసం వెళితే మత్తు ఇంజక్షన్ పేరిట, మందుల పేరిట రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆసుపత్రి వద్దే ధర్నాలు, నిరసనలు చేశారు.



AX-GOVTAP

Wednesday, Feb 22 • 10:57 AM

స్పందన
PATAN MASUM VALI IMRAN KHAN గారు, మీ సమస్య Hospital Staff Bheaving Rude (సమస్య గా నమోదు చేయబడినది. గౌరవనీయులైన District Co-ordinator, Medical వారికి పరిష్కారం కొరకు పంపబడినది. మీ సమస్య 7 రోజుల్లో పరిష్కరించబడుతుంది. మీ ఆర్జీ నంబర్ (Your Spandana Request Number - YSR#) PRA20230222109 స్థితి కొరకు క్రింద ఉన్న లింక్ మీద క్లిక్ చెయ్యగలరు లేదా 1902 టోల్ ఫ్రీ కు కాల్ చెయ్యగలరు లేదా గ్రామ/వార్డు సచివాలయము ను సంప్రదించగలరు

- https://spandana.ap.gov.in

ధన్యవాదములు – 'స్పందన', ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం

'స్పందన' నుంచి వచ్చిన సమాధానం ఇదే



ప్రభుత్వ వైద్యశాలలో వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జరుగుతున్న అవినీతిపై, ఆపరేషన్లకు లంచాలు తీసుకునే పరిస్థితిపై జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని, పేరుకే ప్రభుత్వ వైద్యశాల అని, ప్రవేటు వైద్యశాలలకు మించి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారని పఠాన్ మాసూంవలి ఇమ్రాన్ ఖాన్ వాపోయారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీన ఓ మహిళకు పురిటి నొప్పులు రావడంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళితే డాక్టర్ లేడని, ఉదయం వస్తారని, కాలయాపనచేసి ప్రవేటు వైద్యశాలకు వెళ్లమని సిబ్బంది చెప్పారని, పురిటి నొప్పులు తీవ్రం కావడంతో ప్రవేటు వైద్యశాలకు వెళితే.. ఆ ప్రవేటు వైద్యశాలకు ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు వచ్చి రూ.18 వేలు తీసుకుని ఆపరేషన్ చేసారని తెలిపారు. ఈ తీరుపై జిల్లా మెడికల్ కో ఆర్డినేటర్‌కు ఫిర్యాదుచేస్తే వారు పట్టించుకోలేదని, మీ సమస్య పరిశీలించడమైనదని, 7 రోజులలో పరిష్కరిస్తామని చెప్పినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో లంచం లేనిదే ఆపరేషన్లు చేయడం లేదని తెలిపారు.

లక్షల్లో జీతాలు తీసుకుంటూ..

ప్రభుత్వ వైద్యులుగా ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించవలసిన మీరు, లక్షల్లో జీతాలు తీసుకుంటూ లంచాలకు పాల్పడటం సిగ్గుగా లేదా అంటూ ప్రభుత్వ వైద్యులను, సిబ్బందిని బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాచీటి ప్రసాద్ నిలదీశారు. మీ తీరు మారకపోతే ఆసుపత్రి వద్ద బాధితులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి ఆపరేషన్‌కు లంచం ఇచ్చే పరిస్థితిపై విచారణ జరిపి, ప్రభుత్వ వైద్యుల తీరుపై చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.



నోటీసులందిస్తున్న పోలీసులు

దళిత నాయకుడికి నోటీసులు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

విజయవాడలో జరిగే ధర్నాలో పాల్గొనకుండా దళిత నాయకుడికి పోలీసులు నోటీసులు ఇచ్చి హౌస్ అరెస్ట్ చేయడం మార్టూరులో కలకలం రేపింది. అందిన వివరాల ప్రకారం.. మాల మహానాడు ఆధ్వర్యంలో జరగనున్న ధర్నాకు పెద్దఎత్తున పాల్గొనాలని పర్చూరు నియోజకవర్గం సమతా సైనిక దళ్ కన్వీనర్ బొల్లాపల్లి బెన్నిబాబు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో మార్టూరు పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్ఐ కోడూరు కమలాకర్ ఆదేశాలతో హెడ్ కానిస్టేబుల్ గరుత్మంతుడు గురువారం స్థానిక రామ్ నగర్-నేతాజీ నగర్ కాలనీలోని బెన్నిబాబు నివాసంలో ముందస్తు చర్యగా హౌస్ అరెస్ట్ నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా బెన్నిబాబు మాట్లాడుతూ.. న్యాయమైన హక్కుల కోసం జరిగే ధర్నాలో పాల్గొనకుండా ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరించడం దారుణమన్నారు.

టోల్ పన్ను పెంపును ఉపసంహరించుకోవాలి

స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-అద్దంకి

దేశంలోని టోల్ ప్లాజాల పన్ను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) డిపో కార్యదర్శి పి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ పెంపు వల్ల ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఆర్టీసీలపై భారం పడి ఇంకా నష్టాలలోకి నెట్టబడతాయని వారు పేర్కొన్నారు. వాస్తవంగా రహదారుల అభివృద్ధి సెస్ పేరుతో ప్రతి లీటర్ పెట్రోల్ పైన రూ.5, ప్రతి లీటరు డీజిల్‌పైన రూ.2 అదనంగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. 2017-18 బడ్జెట్ కాలం నుంచి మోడీ ప్రభుత్వం దీన్ని రోడ్డు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్‌గా మార్చేసిందని పేర్కొన్నారు. డీజిల్ కొనుగోలుపై కోట్లాది రూపాయలను ఆర్టీసీలు సెస్ రూపంలో కేంద్రానికి చెల్లిస్తున్నాయని, మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్ కింద కోట్లాది రూపాయలను వసూలు చేసిందని, ఇదే ఆర్థిక సంవత్సరంలోనే సుమారు 1000 టోల్ ప్లాజాల ద్వారా రూ.34,778 కోట్ల రూపాయలను కూడా వసూలు చేసిందని తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధి సెస్ వసూలు చేసిన తర్వాత మరల టోల్ పన్ను వసూలు చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికే ఆర్టీసీలు టోలు పన్ను భారంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రజా రవాణా సంస్థలైన ఆర్టీసీలకు టోల్ పన్ను నుంచి మినహాయింపు నివ్వాలని ఎంతో కాలం నుంచి ఆర్టీసీలు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా రవాణా సంస్థలకు పన్ను మినహాయింపు ఇవ్వడం ద్వారా ఆర్టీసీలకు ఆర్థికంగా కొంత వెసులుబాటుతోపాటు ప్రయాణికులపై కూడా భారం తగ్గుతుందన్నారు. కానీ అవేమీ చేయకుండా ఏకపక్షంగా ఇలాంటి నిర్ణయం చేస్తున్నారన్నారు. నిర్దిష్ట కాల పరిమితి తర్వాత టోల్ పన్ను వసూలను నిలిపివేయాలి. అయితే ఆశ్చర్యకరమైన విషయమేమంటే చాలా టోల్ ప్లాజాలు వారి యొక్క నిర్ణీత గడువు కాలం దాటినా ఇంకా టోల్ పన్నును వసూలు చేస్తూనే ఉన్నాయి. అదేవిధంగా ప్రభుత్వం (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాబిఎన్ హెచ్ఏఐ) టోల్ చార్జీలను ప్రతి సంవత్సరం పెంచుతూనే ఉంది. ప్రస్తుతం తిరిగి ఎన్‌హెచ్ఏఐ ఇప్పటికే ఏప్రిల్ ఒకటి నుంచి టోల్ చార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ చర్య ఆర్టీసీలకు ప్రజలకు ఆర్థికంగా నష్టదాయక మన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఏరియల్ ఒకటి నుంచి టోల్ పన్ను పెంచే ప్రతిపాదనను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిపో, జిల్లా, జోనల్ కార్యదర్శులు ఈ విషయంపై డిమాండ్ చేశారు.

'పది'లో నూరుశాతం ఫలితాలే లక్ష్యం

విద్యార్థులకు తర్ఫీదునివ్వడంలో ఉపాధ్యాయుల విశేష కృషి

ప్రజాశక్తి-బాపట్ల

ఈ విద్యా సంవత్సరంలో జరిగే పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూటికి నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయ వర్గం విశేష కృషి చేస్తోంది. ప్రత్యేక తరగతుల నిర్వహణ, ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, పదిలో పట్టు సాధించే దిశగా విద్యార్థుల్లో నూతన ఉత్సాహం కల్పించడం పాఠ్యాంశాల పట్ల పూర్తి స్థాయిలో అవగాహన కల్పించే దిశగా ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించి ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా పనిచేస్తున్నారు. నూతన విద్యా బోధనకు తెరతీస్తూ సరళమైన రీతిలో విద్యార్థులకు అవగాహన కల్పించే దిశగా పాఠ్యాంశాల బోధన ఇక్కడ జరుగుతోంది. బాపట్ల నూతన జిల్లాగా ఏర్పాటయ్యాక పది పరీక్షలు జరగడం ఇది రెండోసారి. జిల్లాలో ఈ పరీక్షలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేస్తున్నారు. పాఠశాలలో స్టడీ అవర్స్, అసైన్మెంట్, హెూంవర్క్, రోజు వారి పరీక్షలతో పాటు, వారాంతపు పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. పరీక్షల్లో పదును పెంచేందుకు స్కూల్ ఎడ్యుకేషన్ వారు ఇచ్చే ప్రశ్నపత్రాలు (విజయస్ఫూర్తి)ని చదివిస్తూ తిరిగి రాయిస్తూ పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు వారికి అవగాహనతో పాటు ధైర్యం కల్పిస్తున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సరళమైన విద్యా బోధనలో నూరు శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులను ఉపాధ్యాయులు సన్నద్ధం చేస్తున్నారు. దీనికి తోడు పదో తరగతి విద్యార్థుల చదువు విషయంపై తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ కల్పించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. మొత్తంగా పదో తరగతిలో బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ఖ్యాతి నిలబడే విధంగా ఉపాధ్యాయుల కృషి జరుగుతోంది.

పరీక్షల్లో పట్టు సాధిస్తాం: కొండూరు వెంకట సత్యనారాయణరావు, మున్సిపల్ హైస్కూల్ (ఇన్‌ఛార్జి) హెచ్ఎం



ఎందరో ఉద్దండులు విద్యనభ్యసించిన చరిత్ర గల బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో ఈసారి పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు విశేషంగా కృషి చేస్తున్నాం. గతేడాది 70శాతం ఉత్తీర్ణత సాధించాం. ఈ యేడు 235 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలనే దీక్ష పట్టుదలతో పనిచేస్తున్నాం. విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఆందోళన, ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని కల్పిస్తూ విద్యాబోధన గావిస్తున్నాం. విద్యాశాఖ, ఉపాధ్యాయుల సహకారంతో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామని ఆశిస్తున్నాం.



బాపట్లలోని మున్సిపల్ హైస్కూల్

పూర్తి స్థాయిలో ప్రిపేర్ అవుతున్నాం

డి షైనీ, మున్సిపల్ హైస్కూల్, పదో తరగతి విద్యార్థిని



బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో కార్పొరేట్ స్థాయికి మించి విద్యా బోధన జరుగుతోంది. పదో తరగతిలో ఎవరికి వారు ఒకరికి మించి ఒకరు మంచి ర్యాంకులు సాధించాలనే కసితో చదువుతున్నాం. సబ్జెక్టుల పరంగా డౌట్లు ఉంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్నాం. మా మాస్టార్లు కూడా ఈ ఏడు బెస్ట్ పరీక్షల్లో మా హైస్కూలు మంచిపేరు తెచ్చుకోవాలని విద్యాబోధన చేస్తూ విద్యార్థులను పరీక్షలకు ప్రిపేర్ చేస్తున్నారు.

ఉదయాన్నే సబ్జెక్టుల వారిగా ప్రిపేర్ అవుతున్నా..

డి హారిక, పదో తరగతి విద్యార్థిని, మున్సిపల్ హైస్కూల్



ఉదయాన్నే సబ్జెక్టుల వారిగా ప్రిపేర్ అవుతున్నాం. సెలవు దినాల్లో సైతం డౌట్స్ తెలుసుకోవడానికి స్కూల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక క్లాసులకు హాజరవుతున్నాం. స్టడీఅవర్లు (విజయస్ఫూర్తి) పఠనంతో పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తామనే నమ్మకం ఉంది.



స్టడీ అవర్స్‌లో విద్యార్థులు

బాపట్ల సత్తా చాటుతాం

కె తేజేష్, పదో తరగతి విద్యార్థి, బాపట్ల పబ్లిక్ స్కూల్



పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో బాపట్లలో ప్రత్యేకత చాటాలనే ధ్యేయంతో ప్రిపేరవుతున్నాం. అందుకు తగిన థియరీ ప్రకారం చదువుతున్నాం. ప్రధానంగా బాపట్ల పబ్లిక్ స్కూల్లో పదో తరగతిలో నూతన ఒరవడి సృష్టించి టాప్ ర్యాంకులు సాధించేందుకు విద్యాబోధన జరుగుతోంది. అది గాక టీచర్లు ఎప్పటికప్పుడు తల్లిదండ్రుల సలహాలు స్వీకరిస్తూ పదో తరగతి పరీక్షలకు గైడెన్స్ ఇస్తున్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామనే ధీమాతో ఉన్నాం.

పదిలో టాప్ ర్యాంక్ సాధిస్తాం..

పి నాగరాజు, బాపట్ల బీసీ హాస్టల్, మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి



బీసీ హాస్టల్లో ఉంటూ మున్సిపల్ హైస్కూల్లో చదువుతున్నా. పదిలో టాప్ ర్యాంక్ సాధిస్తా. ఉదయం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు, తిరిగి ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు హాస్టల్లో ఉంటూ మునిసిపల్ హైస్కూల్లో చదువుతూ పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నాం. ఇక స్కూలు సమయం ముగిశాక ఐదు గంటల నుంచి స్కూల్లోనే స్టడీ అవర్స్ పెడుతున్నారు. దాంతో పరీక్షల ప్రిపరేషన్‌కు మంచి అవగాహన కలుగుతోంది. బీసీ హాస్టల్లో చదివే విద్యార్థులు సైతం పదిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని నిరూపించాలనే కసితో చదువుతున్నాం.

రాష్ట్రస్థాయి కవితల పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల సాహితీ భారతి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ గురువారం విలేకరులకు తెలిపారు. పోటీలకు పంపే కవితలు అరటావు మించకుండా, హామీపత్రం జతపరిచి కవితలను రాసి పంపాలి. మంచి ఇతివృత్తంతో రాసి పంపిన కవితల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రత్యేక బహుమతులను ప్రదానం చేస్తారు. కవితలను ఏప్రిల్ 10 లోగా ఆదాం షఫీ, సాహితీ భారతి కోశాధికారి, జమేదారు పేట, బాపట్ల 522101, బాపట్ల జిల్లా చిరునామాకు పంపాలి.



ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జగ్జీవన్ రామ్ విగ్రహానికి స్థలం కేటాయించండి

ప్రజాశక్తి-మార్టూరుపురం రూరల్

భారత మాజీ ఉప ప్రధానమంత్రి, దళిత ముద్దుబిడ్డ దివంగత డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పట్టణంలో స్థలం కేటాయించాలని గురువారం మార్టూపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డి బాబీ, ఎం ఉత్తమ్ కుమార్, కాశీరావు, నందిగం సుస్మిత భూషణ కుమారి, సంజీవ్, ప్రభాకర్‌రావు, మునలయ్య, ప్రేమ్ కుమార్, కుమార్, ఏలియా, పోలయ్య, ఆదాం, అనిల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పోలవరం, తమ్మలూరులో జెసిబితో ఇసుకను తవ్వుతున్న దృశ్యం

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ముండ్లమూరు

ఇసుక ఎక్కడ దొరికినా అక్రమార్కులు వదలడం లేదు. ప్రభుత్వ భూములు, ప్రయివేటు వ్యక్తుల భూములతో పాటు శ్మశానాలను సైతం వదలడం లేదు. మండలంలోని పోలవరం, ముండ్లమూరు, తమ్మలూరు, చింతలపూడి గ్రామాల్లో రాత్రనక, పగలనక యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. అక్రమార్కులు ఇసుకను బీమకుర్తి, దర్శి, గంగవరం గ్రామాలే కాక నియోజకవర్గాలు, జిల్లాలు దాటి కూడా ఇసుకను రవాణా చేస్తున్నారు. ఒక లారీ ఇసుకను 18 వేల రూపాయల నుంచి 20 వేల రూపాయలు వరకు అమ్ముతున్నారు. ఇటీవల కాలంలో గుండ్లకమ్మ నది ప్రవాహంలో ఇసుక తీస్తుండగా సమీప గ్రామస్తులు నిలువుదల చేశారు. పోలవరం గ్రామంలో ఎస్‌సి శ్మశానవాటికలో ఇసుకను జెసిబి సహాయంతో తీస్తుండగా ఆ కాలనీవాసులు నిలుపుదల చేశారు. ఇసుక అక్రమ రవాణా అధికారులు, దళారిల పని మూడు పువ్వులు, ఆరు కాయలు చందంగా మారింది. చిలకలేరు వాగు సమీపంలో గ్రామాల ప్రజలు తమ అవసరాల కోసం ఇసుక తెచ్చుకుంటే దళారులు అధికారులకు ఫోన్‌లు చేసి ఇబ్బంది పెడుతున్నారు. ప్రజలు తమ అవసరాల కోసం ఇసుక తెచ్చుకోవడాన్ని తప్పు పడుతున్న అధికారులు అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తుంటే కళ్లు మూసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ప్రజలు బాహటంగానే అంటున్నారు. ఇప్పటికయినా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా అరికట్టి ప్రజా సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై తహశీల్దారు ఉషారాణిని వివరణ కోరగా ఎవ్వరికీ అనుమతులు లేవని, ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

రేపల్లె పట్టణ ఎస్ఐ అబ్దుల్ రజాక్

ప్రజాశక్తి-రేపల్లె

మదర్ థెరిసా ఆటోడ్రైవర్స్ యూనియన్ సిఐటియు ఆర్అండ్‌బి బంగ్లా పక్కనే ఉన్న ఆటోస్టాండ్‌లో చలివేంద్రాన్ని పట్టణ ఎస్ఐ అబ్దుల్ రజాక్, సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ ప్రారంభించారు. శ్రీరామనవమి సందర్భంగా ఆటో స్టాండ్‌లో పానకాన్ని ప్రయాణికులకు, డ్రైవర్లకు అందజేశారు. అనంతరం రేపల్లె పట్టణ ఎస్ఐ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ వేసవికాలంలో ప్రయాణికులు, ప్రజలకు అందుబాటులో పట్టణంలో రద్దీగా ఉండే బస్‌స్టాండ్ పక్కనే ఆటోస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయ మని అన్నారు. ఆటో కార్మికులు తగు జాగ్రత్తలతో ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చాలని, అందరూ ఐక్యంగా ఉండాలని, ఏదైనా ఇబ్బందులు వస్తే 100కు డయల్ చేసి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని అన్నారు. అన్ని వేళలా ఆటో డ్రైవర్లకు, ప్రజలకు పోలీస్ సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉండటం ద్వారా సమస్యలు ఎన్ని వచ్చినా ముందుకు వెళ్లవచ్చని అన్నారు. ఆటోస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా ప్రయాణికులకు సేవ చేయవచ్చని పేర్కొన్నారు. ఈ చలివేంద్రం దొప్పలపూడి వంశీకృష్ణ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా ఆటోస్టాండ్ అధ్యక్షులు కె వెంకటేశ్వరరావు, మరియు సిఐటియు నాయకులు జె ధర్మరాజు, కె ఆశీర్వాదం, కె రమేష్, డి శ్రీనివాసరావు ఆటో వర్కర్స్ డి వంశీకృష్ణ, బాబూరావు, భిక్షాలు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభించి పానకం పంపిణీ చేస్తున్న ఎస్ఐ అబ్దుల్ రజాక్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు మణిలాల్



నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

కృత్రిమ అవయవాలు తీసుకోండి

ప్రజాశక్తి-తర్లుపాడు

వైసిపి ఆధ్వర్యంలో వచ్చేనెల 5న మార్కాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అమర్చే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అవసరమైనవారు ఉపయోగించుకోవాలని కోరుతూ జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షులు డి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పలు గ్రామాల్లోని వికలాంగులను కలిసి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి భూలక్ష్మి రామసుబ్బారెడ్డిని, మండల పార్టీ అధ్యక్షుడు మురారిని సన్మానించారు. గ్రామాల్లో ఎవరైనా ప్రమాదాల్లో కానీ, పోలియో వల్ల కానీ కాళ్ళు, చేతులు పోగొట్టుకుని వుంటే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కాపురం, తర్లుపాడు మండల అధ్యక్షులు ఉంజల శేఖర్, బైరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిజెపి విధానాలతో ఆహార భద్రతకు ముప్పు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి- కొత్తపట్నం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజల ఆహార భద్రతకు ముప్పు కలుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించేందుకు ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా ఆహార భద్రత చట్టం, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, కార్మిక హక్కులు సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం మోడీ ఈ చట్టాలను నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో ఆహార భద్రతకు రూ.90 వేల కోత పెట్టినట్లు తెలిపారు. ప్రపంచ ఆహార భద్రత సూచికలో భారతదేశం 107వ స్థానానికి చేరటం సిగ్గుచేటని తెలిపారు. ఆహార భద్రతకు భంగం కలిగితే అన్ని వర్గాల వారికి నష్టం కలుగుతుందని తెలిపారు. రైతు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడం ద్వారా ఆహార ధాన్యాల సేకరణ జరుగుతుందన్నారు. ఆహార ధాన్యాలను భారత ఆహార సంస్థ ద్వారా భద్రపరిచి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందజేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో లక్షలాది కార్మికులకు ఉపాధి కలుగుతుందని తెలిపారు. రైతులు, కార్మికులు, పేద ప్రజలకు ఈ పథకం ద్వారా ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. ఆహార భద్రతను గాలికి వదిలేస్తే ఈ తరగతిలో ప్రజలందరికీ నష్టం కలుగుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార భద్రతను ప్రభుత్వాలు కల్పించకపోతే నిత్యవసర వస్తువుల ధరలు మరింతగా పెరిగి సామాన్య ప్రజల జీవితాలు అస్తవ్యస్తమవుతాయని తెలిపారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిధులు క్రమంగా కుదిస్తున్నట్లు తెలిపారు. సమ్మె చేసే హక్కు, ఎనిమిది గంటల పని విధానం, భవిష్యత్తు భద్రత, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం లాంటి చట్టాలను కార్మిక వర్గం అనేక పోరాటాల ద్వారా సాధించుకున్నట్లు తెలిపారు. ఆ చట్టాలన్నీ కుదించి కార్పొరేట్లకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం మారుస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పట్టపు ప్రకాశం, నాయకులు పి. ప్రభాకర్, వంగివరపు ఏసమ్మ, జడా నాగమణి, పట్టపు విజయమ్మ, బద్దిపూడి సునీత, బత్తుల పద్మ, పట్టపు తిమోతి, పి.ప్రవీన్ పాల్గొన్నారు.



కొత్తపట్నంలో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు



పామూరులో పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

పామూరు : సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు సయ్యద్ హనీఫ్ తెలిపారు. పామూరులో పంచాయతీ కార్మికులతో హనీఫ్ మాట్లాడారు. ఐక్యంగా ఉంటే హక్కులను సాధించుకోవచ్చునని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి పాలనలో కార్మికులకు ఎలాంటి ప్రయోజనం కలుగలేదని తెలిపారు. ధనవంతులకు అమ్ముడుపోయిన బిజెపి ప్రభుత్వానికి రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 5న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు కొమ్మలపాటి మాల్యాద్రి, షేక్ అల్లాభక్షు, పి. శ్రీను, మాలకొండయ్య, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి యేటా వీరనారాయణ తెలిపారు. ఈ మేరకు మండలపరిధిలోని రావిగుంటపల్లి, మార్కొండాపురం, నర్రమారెళ్ల గ్రామాలలో ఇంటింటి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరనారాయణ మాట్లాడుతూ పని దినాలు తగ్గించి ఉపాధి కూలీల పొట్ట కొడుతున్న బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు వచ్చేనెల 5న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల నాగేశ్వరరావు, వై. చిన్న రాజు, వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నేడు మంత్రి సురేష్ వైపాలెం రాక

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం యర్రగొండపాలెం రానున్నారు. స్థానిక పంచాయతీ భవనం దగ్గర నిర్వహిస్తున్న వైఎస్ఆర్ ఆసరా-3 చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొనున్నట్లు ఎపిఎం మూల వెంకిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రిపురాంతకం, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల ప్రజా ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి సమస్య వివరిస్తున్న వ్యాపారులు

అద్దెదారులకు న్యాయం జరగక పోతే కోర్టుకు వెళ్తా : అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి- కంభం రూరల్

కంభం ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోనిపంచాయతీ గదుల రెన్యూవల్ విషయంలో అద్దెదారులకు న్యాయం జరగక పోతే కోర్టుకు వెళ్ళాల్సి వస్తుందని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కంభం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి.బహ్మయ్యను హెచ్చరించారు. కంభంలో గురువారం నిర్వహించిన ఓ ప్రారంభోత్సవం కార్యక్రమంలో అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ గదుల్లో అద్దెకుంటున్న వారు తమ సమస్యను అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బస్టాండ్ సమీపంలో పంచాయతీ సంబంధించిన 21 గదులు ఉన్నట్లు తెలిపారు. అందులో 19 రూములను పంచాయతీ వారు రెన్యువల్ చేసినట్లు తెలిపారు. రెండు రూములను మాత్రం వేలం పాట నిర్వహిస్తామని, లేదంటే అడ్వాన్సు అమౌంట్ ఎక్కువ కట్టాలని రెన్యువల్ చేయకుండా వేధిస్తున్నట్లు తెలిపారు. దీంతో అశోక్‌రెడ్డి ఇఓతో ఫోన్‌లో మాట్లాడారు. ఏళ్ల తరబడిగా బాడుగలకు ఉంటున్న చిరు వ్యాపారులను వేధించడం సబబు కాదన్నారు. అందరికీ న్యాయం జరిగేలా చూడాలన్నారు. లేనిపక్షంలో కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

దెబ్బతిన్న రహదారులు ..

బస్సులు నిలుపుదల .. ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని కొలుకుల గ్రామానికి వెళ్లే పలు బస్సులు నిలుపుదల చేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. చెన్నరాయుని పల్లె నుంచి కొలుకుల వరకు రోడ్డు సరిగ్గా లేదు. దీంతో మార్కాపురం నుంచి కొలుకుల వచ్చే ఆర్‌టిసి బస్సును గురుపుశాల వరకే నడుపుతున్నారు. దీంతో కొలుకుల గ్రామస్తులు మార్కాపురం వెళ్లాలంటే యర్రగొండ పాలెం వచ్చి వెళ్ళాల్సి వస్తోంది. అదే విధంగా యర్రగొండపాలెం నుంచి గంజివారిపల్లి మీదుగా కొలుకుల రహదారి సక్రమంగా లేదు. దీంతో గంజివారిపల్లి మీదుగా కొలుకుల వచ్చే బస్సును కూడా నిలుపుదల చేశారు. ఈ బస్సును కొలుకుల వరకూ కాకుండా గంజివారిపల్లి వరకే నడుపుతున్నారు.దీంతో కొలుకుల గ్రామానికి ఒక్క బస్సు కూడా రావడం లేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో పనుల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు, వివిధ ప్రాంతాల నుంచి కొలుకుల గ్రామానికి వచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయించి కొలుకుల గ్రామానికి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సోనియాగాంధీ నగర్‌లో సమస్యల తిష్ట

- అధ్వానంగా రహదార్లు
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ
- చెరువులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికారులు



ఖాళీ స్థలంలో చేరిన మురుగు నీరు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

37వ డివిజన్ పరిధిలోని సోనియాగాంధీ నగర్‌లో సమస్యలు తిష్ట వేశాయి. ఖాళీ స్థలాలు ఆప్రాంత ప్రజలకు శాపాలుగా మారాయి. ప్రత్యేకించి సోనియాగాంధీనగర్ మొదటిలైన్ రెండో క్రాస్ రోడ్డులో మౌళిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్ రోడ్డు కొద్ది దూరం మాత్రమే ఉంది. మిగిలినది అంతా మట్టి రోడ్డే. అది కూడా స్థానికులు ఏర్పాటు చేసుకున్నదే. రోడ్డుకు ఇరువైపులా మురుగు కాల్వలు లేవు. దీంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు బయటకు పోయే వీలు లేక సమీపంలోని ఖాళీ స్థలాలు మురికి కూపాలుగా మారాయి. ఈ లైన్‌లో ఓప్రయివేటు స్కూల్‌కు సంబంధించిన హాస్టల్ ఉంది. అందులో సుమారు 200 మంది విద్యార్థులు ఉంటున్నారు. వారు వినియోగించే వాడుక నీరంతా డ్రెయినేజీ లేక పోవడంతో సమీపంలోని ఖాళీ స్థలంలో, రోడ్డుమీదకు చేరుతోంది. హాస్టల్ నుంచి వచ్చే వాడుక నీరు పక్క వీధిలోని డ్రెయిన్‌లోకి కలిసేలా అవుట్ లెట్ ఏర్పాటు చేయాల్సిఉంది. అయినప్పటికీ నిర్వాహకులు తమకేమి పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. మురుగు కారణంగా పట్టపగలే ఆప్రాంత నివాసితులపై దోమలు దాడిచేస్తున్నాయి. రాత్రి అయితే దోమల దాడికి తట్టుకోలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు భూగర్భంలో ఇంకిపోయి బోరు నీళ్లు కూడా కలుషితం అవుతున్నాయని, దీంతో చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. కాలనీలో సగం ప్రాంతానికి వీధిలైట్లు కూడా లేవు. రాత్రి సమయంలో ఆప్రాంతమంతా అంధకారం అలముకుంటోంది. కరెంటు స్తంభాలు ఉన్నా వీధిలైట్లు ఏర్పాటు చేయలేదు. రోడ్డు, కాలువలు ఏర్పాటు చేయాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని గతంలో కార్పొరేషన్ పాలకులు, ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అధ్వానంగా తయారైన డ్రెయినేజీ

సమస్యలు పరిష్కరించాలి : ఆచారి



చూడటానికి మాకాలనీ అభివృద్ధి చెందిన ప్రాంతంగా కనిపిస్తోంది. అయినప్పటికీ కాలనీలో అన్నీ సమస్యలే ఉన్నాయి. ఇళ్లలో మురుగునీరు పోయే ఏర్పాటు లేక స్నానాలు చేసేందుకు కూడా ఆలోచించాల్సిన పరిస్థితి ఉంది. సమీపంలోని హాస్టల్ వాళ్లు వాడుకనీరంతా రోడ్డుమీదకు, ఖాళీ స్థలంలోకి వదులుతున్నారు. ఆ మురుగునీరంతా ఇళ్లను చుట్టుముడుతోంది. దోమలు, పాములతో సాహజీవనం చేస్తున్నాం. పాలకులు పట్టించుకొని సమస్యలు పరిష్కరించాలి.

వర్షాకాలం ఉండలేని పరిస్థితి : పిచ్చయ్య



వర్షాకాలం వస్తే కాలనీలో ఉండలేని పరిస్థితి వస్తుంది. డ్రెయినేజీలు లేని కారణంగా చుట్టూ ఖాళీ స్థలాల్లో నీరు చేరి ఆనీరు ఇళ్లను చుట్టు ముడుతోంది. నడిరోడ్డుపై మోకాళ్ల లోతున నీళ్ల వారాల తరబడి ఉంటున్నాయి. ఖాళీ స్థలాలయజమానులు మెరకతోలించడం లేదు. కార్పొరేషన్ అధికారులకు చెబితే వారూ పట్టించుకోవడం లేదు.

అధికారులు పట్టించుకోలేదు: కోటేశ్వరరావు



కాలనీలో రోడ్డు, కాల్వలు నిర్మించాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులందరూ కలిసి మేయర్, కమిషనర్, స్థానిక కార్పొరేటర్‌ను కలిసి విన్నవించాం. చూస్తాం, చేస్తామన్నారు. స్పందన లేదు. కనీసం మురుగు పారేందుకు వీలుగా కాలువ కట్టమని అడిగాం. అయినా పట్టించుకోలేదు. మురుగుపోయే మార్గం లేక నానా అవస్థలు పడుతున్నాం.

పశ్చిమ ప్రాంతంపై వైసిపిది సవతి తల్లి ప్రేమ

గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



ప్రజాచైతన్య యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

పశ్చిమ ప్రకాశం ప్రాంతంపై వైసిపి సవతి తల్లి ప్రేమ చూపుతోందని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మార్కాపురం మాజీ ఎమ్మెల్య కందుల నారాయణరెడ్డి చేపట్టిన ప్రజాచైతన్యయాత్ర ఐదో రోజు గురువారం మండల పరిధిలోని బచ్చలకూరపాడు, సిద్ధవరం, కొనకనమిట్ల, ఎదురాళ్ళపాడు, తువ్వపాడు గ్రామాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని కందుల నారాయణరెడ్డికి సంఘీ భావం తెలిపాడు. అనంతరం అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాయలసీమను అభివృద్ధి చేస్తూ పశ్చిమ ప్రకాశం ప్రాంతంపై సవతి తల్లి ప్రేమను చూపడమేంటని ప్రశ్నించారు. శ్రీపూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటులోనూ వివక్షత చూపారన్నారు. మాట తప్పను-మడమ తిప్పనని ప్రలోభాలు పలుకుతూ పశ్చిమ ప్రాంత ప్రజలను మోసం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వైసిపి అధికారంలో ఉన్నప్పటికీ మార్కాపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించడంలోనూ రాజకీయం చేశారని విమర్శించారు. నియోజకవర్గాన్ని మామ అల్లుళ్ల విభజించి పాలిస్తున్నారన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మోరబోయిన బాబూరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, పొదిలి ఎఎంసి మాజీ చైర్మన్ చప్పిడి రామలింగయ్య, వెలుగొండ ఆలయ మాజీ చైర్మన్ కుందురు కాశిరెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి గౌస్‌బాషా, టిడిపి మండల మాజీ కన్వీనర్లు కనకం నరసింహారావు, వరికూటి వెంకటరామిరెడ్డి, నాయకులు కె.రామిరెడ్డి, సాల్మన్, రోశయ్య, కరిదెర నాసరయ్య, పి.సుఖదేవ్, బాషాపతి నాయుడు, కాటంరాజు, పి.వెంకటేశ్వరరెడ్డి, బయ్యా నాగేశ్వరరావు, వేంపాటి శ్రీకాంత్‌రెడ్డి, బరిగె బాలయ్య, నరసింహారావు, రమణారెడ్డి, డేవిడ్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- దొనకొండ

స్థానిక కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో ఈ ఏడాది నుంచి జూనియర్ కళాశాలను ప్రారంభిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి అరుణ తెలిపారు. జూనియర్ ఇంటర్, 6వ తరగతిలో బాలికలకు 40 సీట్లు చొప్పున అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాప్ అవుట్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చునని ఆమె తెలిపారు.

భీమవరంలో అన్నదానం

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండల పరిధిలోని భీమవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభం, నాభిశిల ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పురోహితులు పిచ్చయ్యశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టలో జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి శ్రీధర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి అనమలమూడి సుజాత వెంకట్రావు, గ్రామ పెద్ద రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలు.. ప్రజలు బేజారు


ప్రజాశక్తి- కంభంరూరల్

కంభం పట్టణంలో ఇటీవల వరుస చోరీలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలు బేజారవుతున్నారు. ప్రధానం పార్కింగ్ చేసిన బైకులు చోరీకి గురవుతున్నాయి. దీంతో ప్రజలు ఆందోళనకు చెందుతున్నారు. బస్టాండు సమీపంలోని ఆర్‌టిసి కార్గో ఆఫీసు పక్కన పార్కింగ్ చేసిన బైకును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఇటీవల కంభం బస్టాండు మసీదు వద్ద పార్కింగ్ చేసిన బైకును అపహరించారు. కంభం అర్బన్ కాలనీలోని ఓ గృహంలో రూ. 20వేల నగదును చోరీ చేశారు. వరుస చోరీలతో ప్రజలు బెంబెలెత్తుతున్నారు. పోలీసు అధికారులు స్పందించి నిఘా పెంచి చోరీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు 'ఆసరా' చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక కొండపి రోడ్డులో డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా చెక్కులు శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు వెలుగు ఎపిఎం గంటా శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు డ్వాక్రా మహిళలకు రూ.11.52 కోట్లు చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు హాజరవుతారని తెలిపారు. మండల పరిధిలోని డ్వాక్రా మహిళలందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపిఎం కోరారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి- కంభం రూరల్

కంభం పట్టణంలోని చౌక్ సెంటర్‌లో శ్రీ సాయిబాబా క్లాత్ మర్చంట్ యజమాని ఐతా కష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్ర ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. వేసవిలో ప్రజల దాహార్తీ తీర్చేందుకు దాతలు ముందుకు రావాలిన ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బడుగు వెంకటేశ్వర్లు

ఇంటి స్థలాలు మంజూరు చేయాలి : బడుగు

ప్రజాశక్తి-పిసిపల్లి

మండల పరిధిలోని నేరేడుపల్లి గ్రామంలో గత 12 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న పాముల కులస్తులకు వారు నివాసం ఉండే స్థలంలోనే ఇంటి పట్టాలు మంజూరు చేసి పక్కా గహాలు మంజూరు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. నేరేడు పల్లిలో గురువారం పర్యటించి పాముల కులస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాముల కులస్తులకు ప్రభుత్వం చేయూతను అందించాలన్నారు. వారికి సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో నున్న అటవీ ప్రాంతంలో పాముల కులస్తులకు స్థలాలు మంజూరు చేసి అక్కడ గృహాలు నిర్మించు కోవాలని అధికారులు చెబుతున్నట్లు బాధితులు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరి, నాగులూరి వెంకటయ్య, గుడిసె వాసులు పాల్గొన్నారు.

కోటేశ్వరరావుకు డాక్టర్ వెంకయ్య పరామర్శ



కోటేశ్వరరావును పరామర్శిస్తున్న డాక్టర్ వెంకయ్య

ప్రజాశక్తి-టంగుటూరు

మండలపరిధిలోని మల్లవరప్పాడు గ్రామానికి చెందిన తేళ్ల కోటేశ్వరరావు 20 రోజుల క్రితం పెళ్లూరు సమీపంలోని సాయిబాబా సెంట్రల్ స్కూల్‌లో ప్రమాదానికి గురయ్యాడు. సాయి బాబా స్కూలు యాజమాన్యం కోటేశ్వరావు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గ్రామస్తులు పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్యకు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా డాక్టర్ వెంకయ్య కోటేశ్వరరావు రిమ్స్ వైద్యశాలలో కోటేశ్వరరావును గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితిపై వైద్యులతో చర్చించారు. కోటేశ్వరరావుకు మెరుగైన వైద్యశాలకు అందించాలని వైద్యులకు సూచించారు.

వధూవరులకు ఆశీర్వాదం

మండల పరిధిలోని ఎం.నిడమలూరు అరుంధతి నగర్‌లో పల్లెపోగు వారి వివాహ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొని నూతన వధూవరులు పల్లెపోగు రాజు, అమందీపికను ఆశీర్వదించారు. అనంతరం గ్రామస్తులతో కొంతసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వల్లంరెడ్డి రమణారెడ్డి, మన్నం హరిబాబు, రాధ దంపతులు, దేవరపల్లి వరుణ్, బొడ్డు శ్రీనివాసరావు, దావులూరి సునీల్, బొడ్డు వేణు, చొప్పర శివ తదితరులు పాల్గొన్నారు.



కంటి ఆపరేషన్లకు తరలిస్తున్న దృశ్యం

కంటి ఆపరేషన్‌కు తరలింపు

ప్రజాశక్తి- కొమరోలు

మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కామూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 700 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని తెలిపారు. ఈనెల 27న 150 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం శంకర్ ఆసుపత్రికి తరలించారు. వారికి ఆపరేషన్లు చేయించి స్వగ్రామానికి తీసుకొచ్చారు. గురువారం మరో 140 మందిని రెండు బస్సుల్లో గుంటూరు శంకర్ ఆసుపత్రికి తరలించారు. ఈ బస్సులను ఎంపిపి కామూరి అమూల్య, ఎంపిటిసి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. మిలిగిన వారిని ఆదివారం కంటి ఆపరేషన్లకు తరలించనున్నట్లు ఎంపిపి కామూరి అమూల్య తెలిపారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మార్కాపురం పట్టణంలోని గడియార స్తంభం వద్ద రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గతంలోనూ పేదలకు, విద్యార్థులకు, మానసిక వికలాం గులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్‌లోనూ సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆయన కోరారు. వేసవి నేపథ్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతల ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసిన రెడ్డి సంక్షేమ సేవా సంఘం నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, రెడ్డి సంక్షేమ సేవా సంఘం నియోజకవర్గ కో కన్వీనర్ కర్ణ నరసింహారెడ్డి, కమిటీ సభ్యులు శివారెడ్డి, లక్ష్మీ రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వాడవాడలా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన మండల పరిధిలోని రాజుగారిపాలెం శ్రీరాముని ఆలయం ఆవరణలో గురువారం శ్రీరామనవమి వేడుకలు గ్రామస్తుల ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా వేడుకగా నిర్వహించారు. ప్రతి ఏటా ఈ గ్రామంలో శ్రీరామనవమి నిర్వహించే వేడుకలకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి అనేక మంది భక్తులు పాల్గొనడం విశేషం. గ్రామ కమిటీ ఉప్పలపాటి తిరుపతిరాజు, విన్నమూరి సత్యనారాయణ, వేజెండ్ల వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి అచ్చిరాజు, మురహరి పుల్లయ్య, మార్టూరు హీరో షోరూమ్ అధినేత కళ్లేపల్లి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 22 మంది జంటలకు కళ్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అద్దంకి: పట్టణ మరియు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో శ్రీరామనవమి పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా గురువారం నిర్వహించారు. అనేక గ్రామాల్లో శ్రీరామ దేవస్థానాలలో చలువ పందిళ్లను ఏర్పాటు చేసి గ్రామంలోని పలువురు ఉత్సాహవంతులు కళ్యాణ మహోత్సవాలను నిర్వహించారు. పట్టణంలో ఆయిల్ మిల్ రోడ్, రామా టాకీస్ పక్క బజార్, గాంధీ బొమ్మ సెంటర్, సింగరకొండ కోదండరామ స్వామి ఆలయాలలో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించడంతోపాటు భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ యార్డ్ సమీపంలోని రోజువారి ముఠామేస్త్రి కేశవ శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా సొంత నిధులను వెచ్చించి భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

తర్లుపాడు: తర్లుపాడు గ్రామంలో మెయిన్ బజారులో వెలసిన పట్టాభి సీతారాములవారి ఆలయంలో, తర్లుపాడు యాదవ బజారులోని కోదండ రాముల వారి ఆలయంలో తర్లుపాడు ముదిరాజ్, కోట వీధిలో వెలసిన శ్రీరాముల వారి ఆలయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహ మూర్తులకు కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు వందలాది భక్తులు హాజరయ్యాయి. స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చెన్నారెడ్డిపల్లి గ్రామంలో వెలసిన బాలంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

హనుమంతునిపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కవిత దంపతులు పాల్గొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామచంద్రుల చల్లని దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, కనిగిరి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మార్టూరు మండలం రాజుగారిపాలెంలో సీతారాముల కల్యాణం



అద్దంకి మెయిన్ బజార్లో నవమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



తర్లుపాడులో..



హనుమంతునిపాడు మండలం తిమ్మారెడ్డిపల్లిలో..



తాడివారిపల్లి ఎస్ఐ సుధాకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఎస్ఐ సుధాకర్‌కు సన్మానం

ప్రజాశక్తి-తర్లుపాడు

నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండలంలోని తాడివారిపల్లి ఎస్ఐ వి సుధాకర్‌ను స్థానిక వేణుగోపాల స్వామి దేవస్థానం చైర్మన్ జవ్వాజి విజయభాస్కరరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. దేవస్థానం చైర్మన్‌తో పాటు వాసవీ అన్నదాన సముదాయ మెంబర్లు పోలేపల్లి జనార్ధన్, దోగిపర్తి మల్లికార్జునరావు, జవ్వాజి వెంకటేశ్వర్లు, కోలగట్ల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ క్రింది వార్తకు ఫోటో పంపిస్తున్నాము రైటప్



మాట్లాడుతున్న చేనేత నాయకులు బాలాజీ

దీక్షలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

చేనేత పరిశ్రమ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఏప్రిల్ 3,4 తేదీలలో జరిగే 36 గంటల సామూహిక దీక్షలను చేనేత, అనుబంధ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షులు గొట్టిముక్కల బాలాజీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేతకు ప్రభుత్వం విధించిన జిఎస్టీని ఎత్తివేయాలని, చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. క్షీణిస్తున్న చేనేత రంగాన్ని అన్ని విధాలా అదుకుంటామని గద్దెనెక్కిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకుండా నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. సత్యసాయి జిల్లా ధర్మవరంలో చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించి నిబంధనలకు విరుద్ధంగా మరమగ్గాలు ఏర్పాటు చేసి చీరలు తయారు చేస్తున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జిల్లాలో చేనేత వస్త్ర నిల్వలు పేరుకుపోయి కార్మికులకు ఉపాధి లేకుండాపోయిందన్నారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ కల్పించాలని, ఆత్మహత్యలు చేసుకున్న కార్మికులకు రూ.1.50 నుంచి రూ.5 లక్షలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, జిఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహనరావు, రూపానంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆసరా చెక్కులు పంపిణీ

ఏపీఎం గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక బస్‌స్టాప్ సెంటర్ కొండపి రోడ్డులో శుక్రవారం డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేయనున్నట్లు వెలుగు ఏపీఎం గంటా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు టంగుటూరు మండల డ్వాక్రా మహిళలకు రూ.11.52 కోట్ల చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు హాజరవుతారని, డ్వాక్రా మహిళలందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీఎం గంటా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.



జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రణతి

'శ్రీ ప్రతిభ' అభినందన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆలిండియా ఫోరెన్సిక్ సైన్స్ ప్రవేశ పరీక్ష (ఏఐఎఫ్ సెట్) ఫలితాలలో పేర్నమిట్ట శ్రీ ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థిని చీమలదిన్నె ప్రణతి జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచింది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని ప్రణతిని శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సి.ఇ.ఒ. జయప్రకాష్ నారాయణ్ ప్రత్యేకంగా అభినందించారు. కాలేజీ వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు మాట్లాడుతూ ఫోరెన్సిక్ సైన్స్ రంగంలో చదవడానికి ధైర్యం, సాహసం, సమయస్ఫూర్తి, ఆసక్తి ఉండాలని తెలియజేశారు. ఈ ఫలితాలను సాధించడానికి దోహదపడిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

గొంతెండుతోంది.!

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక అవసరాలను గుర్తించి వేసవి కార్యాచరణ ప్రణాళికను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముందుగానే సిద్ధం చేయాల్సి ఉంది. మంచినీటి పథకాల ద్వారా గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని నింపేందుకు 15 ఏళ్ల క్రితం యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లోని 37 గ్రామాల్లో ఒక్కో ఓవర్ హెడ్ ట్యాంకుకు రూ. 15 లక్షలు వ్యయంతో నిర్మించారు. అయితే ఇప్పటివరకు ఆ ట్యాంకులకు చుక్కనీరు నింపలేదు. దీంతో ఆ ట్యాంకులన్నీ దిష్టి బొమ్మలా దర్శనమిస్తున్నాయి. కేవలం వేసవి సమయంలో అధికారులు, పాలకులు హంగామా చేయడం తప్ప మామూలు సమయంలో నీటి అవసరాలు తీర్చేందుకు మంచినీటి పథకాలకు మరమ్మత్తులు చేయడం, పైపులైన్ల నిర్మాణాలు సరి చేసుకోవడం లాంటివి చేయకపోవడం పట్ల ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా వేసవిలో నీటి సమస్యను పరిష్కరించి ప్రజలను ఆదుకోవాలని కోరుతున్నారు.



2019 నుంచి చెల్లింపుల్లేవు..

యర్రగొండపాలెం, దర్శి, మార్కాపురం, నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాలకు చెందిన 83 గ్రామాల్లో మొన్నటి దాకా రోజుకు 725 ట్రిప్పుల చొప్పున ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేవారు. అందుకు సరాసరిన ట్రిప్పునకు రూ.600 చొప్పున నిధులు ఖర్చు చేస్తున్నారు. కాగా గత ముడున్నరేళ్ల నుంచి ట్యాంకర్ల బిల్లులు చెల్లించకపోవడంతో ట్యాంకర్ల యజమానులు ట్యాంకర్ల తోలకం నిలిపివేశారు. ప్రస్తుతం సర్పంచులే ట్యాంకర్ల యజమానులకు బతిమిలాడుకొని అక్కడకక్కడ ట్యాంకర్ల ద్వారా నీటిని తోలిస్తున్నారు. ఒక్క యర్రగొండపాలెం నియోజకవర్గంలోనే రూ. 62 కోట్లు దాకా బకాయిలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వేసవిలో వడగాలుల తీవ్రత పెరిగే కొద్దీ జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ నెలాఖరుకల్లా తాగునీటి సమస్య మరింత తీవ్రతరం కానుంది. గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు సంబంధించి 2019 సంవత్సరం నుంచే బకాయిలు అపరిష్కృతంగా ఉన్నాయి. ఆ ఏడాది రూ.4.77 కోట్ల మేర చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు మొత్తం. రూ.132.06 కోట్ల మేర బిల్లులు బకాయిలున్నాయి. నీటి సరఫరా అనేది అత్యవసరం. దీనికి కూడా నాలుగేళ్లుగా చెల్లింపులు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోట్లాది రూపాయల మేర బిల్లులు పెండింగ్ ఉండటంతో సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ట్యాంకర్ వస్తేనే నీరు

తాటి గురవమ్మ, గృహిణి, వేగినాటి కోటయ్య నగర్



ట్యాంకర్ వస్తేనే నీరు. లేకుంటే కన్నీరే. డీప్‌బోర్లన్నీ ఒట్టిపోయాయి. ట్యాంకర్ వచ్చినప్పుడు డ్రమ్ములకు పట్టుకొని నాలుగైదు రోజులు పాటు ఆ నీటిని పొదుపుగా వాడుకుంటున్నాం. ట్యాంకర్ రాకుంటే నీటి ఇబ్బందులు అన్నీ ఇన్నీ కాదు.

డీప్‌బోర్లన్నీ ఒట్టిపోయాయి

పరిమి కోటేశ్వరరావు, చాపలమడుగు



డీప్‌బోర్లన్నీ ఒట్టిపోయాయి. గంటకు బిందె నిండడం కూడా గగనంగా మారింది. నీటి కోసమే ఒక మనిషి పని మానుకొని ఉండాల్సి వస్తోంది. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే రెండు నెలలను గుర్తు చేసుకుంటే భయమేస్తోంది. శాశ్వత నీటి పరిష్కారం చూపకపోతే నీళ్ల కోసమే వలసలు వెళ్లే పరిస్థితి తప్పేలా లేదు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న కార్మిక, కర్షక చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మిక, రైతు, ప్రజాసంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, సిఐటియు జిల్లా నాయకులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10 వేలు, రైతుల పంటకు కనీస మద్దతు ధర, గ్రామీణ వ్యవసాయ కార్మికులకు ఉపాధి రక్షణ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. అధిక ధరలు అరికట్టాలన్నారు. ఈ డిమాండ్లపై ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక, కర్షక ప్రదర్శన జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, పూసపాటి వెంకటరావు, రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బెజవాడ శ్రీను, కె.చిన్నపురెడ్డి, కొల్లూరి వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ నాయకులు టి.రామారావు, సిఐటియు నాయకులు నాగయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శిద్దా సుధీర్‌కుమార్

చీమకుర్తి తిరునాళ్లను జయప్రదం చేయండి

- 4న హరిహరక్షేత్రం వద్ద తిరునాళ్లకు ఏర్పాట్లు
- ఏపి ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ శిద్దా సుధీర్ కుమార్

ప్రజాశక్తి-చీమకుర్తి

ఏప్రిల్ నాలుగున చీమకుర్తి తిరునాళ్ల, హరిహరక్షేత్ర వార్షికోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఏపి ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ శిద్దా సుధీర్‌కుమార్ కోరారు. తిరునాళ్లకు సంబంధించిన ఏర్పాట్ల గురించి చర్చించేందుకు గురువారం పట్టణంలోని ఆర్యవైశ్య సోదరులందరూ సమావేశమయ్యారు. ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో గత 15 ఏళ్ల నుండి చీమకుర్తి తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా శిద్దా సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో తిరునాళ్ళను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రభ కమిటీ సభ్యులకు సూచించారు. సమావేశంలో శిద్దా సుధాకర్, చీమకుర్తి మండల ఆర్యవైశ్య అధ్యక్షులు నూనె హేమసుందరరావు, ప్రభ కమిటీ సభ్యులు నూకల సుబ్రహ్మణ్యం, మద్ది వెంకట్రావు, ఆళ్ళపాటి శ్రీనివాసరావు, సురేంద్ర, హనుమంతు, హరి, కిరణ్, ఆర్యవైశ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా విద్యుత్ ప్రభల ఏర్పాటు

ప్రజాశక్తి-దరిశి

శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని లంకోజనపల్లిలో శ్రీఆంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీ పోటాపోటీగా విద్యుత్ ప్రభలు ఏర్పాటుచేశాయి. ఈ సందర్భంగా ఉదయం నుండి భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైసిపి ఆధ్వర్యంలో సర్పంచ్ కొరివి చినకోటయ్య, వైస్ ఎంపిపి కొరివి మునసలయ్య నిర్వహణ చేయగా, టిడిపి ఆధ్వర్యంలో బాలగురవయ్య, సుబ్బారావు, వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





వైసిపి, టిడిపి ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభలు

సముద్రతీర ప్రాంతంలో కోడిపందేలు

- లక్షలు చేతులు మారుతున్న వైనం
- టీడీపీ, వైసీపీ నాయకులు పెత్తనం
- తెలిసినా పట్టించుకోని పోలీసులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలోని సముద్రతీర ప్రాంతంలో బరి గీసి మరీ కోడిపందేలు ఆడుతున్నారు. లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. దీనిలో అధికార పార్టీ నేతలే కాకుండా ప్రతిపక్ష టిడిపి నేతలు కూడా భాగస్వాములవడం గమనార్హం. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పోలీసులు కూడా కోడిపందేల విషయం తెలిసినా.. పట్టించుకోని పరిస్థితి ఉంది.

మండలంలోని పాకల ఊళ్లపాలెం గ్రామ పంచాయతీలో ఉన్న సముద్ర తీర ప్రాంతంలో కోడిపందేలు జోరుగా నిర్వహిస్తున్నారు. ఒక రోజు పాకల పంచాయతీలో, మరో రోజు ఊళ్లపాలెం పంచాయతీలో బహిరంగంగానే ఈ పందేలు జరుగుతున్నాయి. వందలాది మంది మోటార్‌బైకులు, కార్లు వేసుకొని మరీ అక్కడికి చేరుకుంటున్నారు. కోళ్లకి కత్తులు కట్టి మరీ బరిలోకి దించి.. రూ.లక్షల్లో పందేలు కాస్తున్నారు. టంగుటూరు మండలంలోని సముద్ర తీర ప్రాంతాల్లో కూడా ఈ కోడిపందేలు జరుగుతున్నాయి. నిర్వాహకులు కొందరు పోలీసులకు రోజువారీ మామూళ్లు ఇస్తూ.. ముందస్తు సమాచారం ఇచ్చేందుకు వారితో బేరాలు కుదుర్చుకుంటున్నారు. పోలీస్‌స్టేషన్ నుంచి పోలీసులు కదిలితే తమకు సమాచారం వచ్చేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రధానంగా ఈ సముద్ర తీర ప్రాంతంలో శనివారం, ఆదివారం అధికంగా పందేలు జరుగుతున్నాయి. శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్ గతంలో పాకలలో కోడిపందేలు ఆడుతున్నారని తెలిసి.. అక్కడ మత్స్యకారులతో మాట్లాడి.. ఆడకుండా చేస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఆ ప్రాంతం వైపు పోకపోవటం గమనార్హం. ఉన్నతాధికారులు ఇలాంటి పందేలపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



తలపడుతున్న పందెం కోళ్లు

బూచేపల్లి కుటుంబం విద్యాభివృద్ధికి కట్టుబడి ఉంది

జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ

ప్రజాశక్తి-చీమకుర్తి

విద్యాభివద్ధికి బూచేపల్లి కుటుంబం కట్టుబడి ఉందని, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి ఆశయాలు కొనసాగిస్తామని జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. మండలంలోని బూచేపల్లి కోటిరెడ్డి సుబ్బమ్మ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల రజతోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కరశాస్త్రి అధ్యక్షత వహించారు. బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి తన స్వగ్రామమైన దేవరపాలెం పంచాయతీని దత్తత తీసుకొని వారి తల్లిదండ్రుల పేరు మీద సొంత నిధులతో పాఠశాలను ఏర్పాటుచేసినట్లు ఆమె పేర్కొన్నారు. సుబ్బారెడ్డి చూపిన మార్గంలో నడుస్తూ ఆయన ఆశయాలకనుగుణంగా విద్యాభివద్ధికి తమ వంతు కషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల అభివద్ధికి తమ సొంత నిధులతో కషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యాభివద్ధికి ఎలాంటి సహకారం కావాలన్నా తాము ముందుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మను పాఠశాల ఉపాధ్యాయ బందం, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు చిన్నపరెడ్డి మస్తాన్‌రెడ్డి, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, పులి వెంకటరెడ్డి, శివ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు డివి సుబ్బారావు, స్వరూపారాణి, ఫిజియాది లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

శ్రీరామనవమి సందర్భంగా

దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు

- ఎస్‌పి మలికగర్గ్ - వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

శ్రీరామనవమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ప్రముఖ దేవాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశామని ఎస్పీ మలికగర్గ్ పేర్కొన్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వేంచేసియున్న శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలో ప్రకాశం జిల్లా ఎస్పీ మలికగర్గ్, బాపట్ల ఎస్పీ వకుల్‌జిందాల్ దంపతులు పాల్గొని.. స్వామి వార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య సాంప్రదాయబద్ధంగా మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలను నిర్వహించి కమనీయంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మలికగర్గ్ మాట్లాడుతూ శ్రీరామ నవమి రోజున సీతారామ కళ్యాణ మహోత్సవంలో మొదటిసారిగా పాల్గొనడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. శ్రీరాముడు ఆచరించిన జీవన విధానం పరిపూర్ణ మానవ జీవితానికి నిలువెత్తు నిదర్శనమని, సీతారాముల యొక్క జీవిత చరిత్ర ప్రజలందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కరుణ, దయ, నీతి, చిత్తశుద్ధి, ప్రేమ, ధర్మం, సత్యం ఆచరించి మార్గదర్శకంగా నిలవాలన్నారు. అనంతరం ఎస్పీ దంపతుల చేతుల మీదుగా భక్తులకు, ప్రజలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ (క్రైమ్) శ్రీధర్ రావు,ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఒంగోలు డిఎస్పీ యు.నాగరాజు, ఎఆర్ డిఎస్పీ వెంకటేశ్వరరావు, డిపిఓ ఏఓ సులోచన, ఐసిసిఆర్ ఇన్స్పెక్టర్ కె.రాఘవేంద్ర, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు, శ్రీకాంత్ నాయక్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ యం.రమణ దీక్షితులు, యం.దక్షణామూర్తి, పోలీస్ సిబ్బంది, ప్రజలు మరియు భక్తులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న ఎస్‌పి వకుల్‌జిందాల్, ఎస్‌పి మల్లికగర్గ్ దంపతులు